## ఓటుహక్కుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ



కార్మికులతో ప్రతిజ్ఞ చేయించిన అధికారులు

**మణికొండ:** వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని తమకు నచ్చిన నాయకున్ని ఎన్నుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని ఎన్నికల నోడల్ అధికారి, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. గురువారం నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో పారిశుద్ధ్య కార్మికులతో ఓటుహక్కుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు, ఓటర్లతో ఎన్నికల్లో తప్పనిసరి ఓటు వేస్తానని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఎన్నికల్లో 90 శాతం పోలింగ్ జరిగితే మరింత ఆదరణ లభిస్తుందన్నారు. దీనికి రాబోయే ఎంపీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని ఆయన కోరారు. నార్సింగి మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ యోగేష్, డీఈ నరసింహరాజు, మున్సిపల్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

## ఆక్రమణను అడ్డుకున్న అధికారులు



మణికొండ శ్మశానవాటిక ఆక్రమణలను తొలగించిన రెవెన్యూ అధికారులు

**మణికొండ:** కాదేదీ కబ్జాకు అనర్హం అన్న చందంగా దళితుల శ్మశానవాటిక స్థలాన్ని ఆక్రమించుకునేందుకు యత్నించిన బిల్డర్ ఆగడాలను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. మణికొండ మున్సిపాలటీ కేంద్రంలోని సర్వే నెంబర్ 199లో దళితుల శ్మశానవాటిక ఉంది. కాగా దానికి ఆనుకునే పట్టా భూములు ఉండటంతో వారు శ్మశానవాటికలోని కొంత భూమిని ఆక్రమించి రేకుల షీట్‌లను ఏర్పాటు చేసి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. దీంతో స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయటంతో వెంటనే స్పందించిన గండిపేట తహసీల్దార్ నర్రా శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు సురేష్, విక్రంరెడ్డిలు గురువారం రేకులషీట్‌లను తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై క్రిమినల్ కేసులను నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

## బీజేపీ ఇంటింటి ప్రచారం



మణికొండలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు

**మణికొండ:** వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు గురువారం మణికొండలోని పలు కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు దేశ ప్రతిష్టను ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్న నరేంద్ర మోదీకి మద్దతుగా నిలిచేందుకు ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటు వేయాలన్నారు. రాష్ట్ర నాయకులు ప్రేమ్‌రాజ్‌యాదవ్, అంజన్‌కుమార్‌గౌడ్, వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, జిల్లా ఉపాధ్యక్షుడు కె. నరేందర్‌రెడ్డి, నాయకులు కొమరయ్య, రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం కన్వీనర్ మల్లేష్‌యాదవ్, కో- కన్వీనర్ మహాలింగంగౌడ్, మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు సి.బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి మిద్దెల సురేందర్‌రెడ్డి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

**అత్తాపూర్:** చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో అత్తాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు మిద్దెల సురేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు ఎర్ర శంకర్, పీఎంరెడ్డి, శివారెడ్డి, రజినీకాంత్‌రెడ్డి, ఆనంద్, శ్రీధర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నియామకం

**శంషాబాద్:** వచ్చే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పీసీసీ అధికార ప్రతినిధి రాచమల్ల సిద్దేశ్వర్‌ను నియమించారు. ఈ మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జిల జాబితాను పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ విడుదల చేశారు. నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజార్టీ సాధించేందుకు కృషి చేస్తానన్నారు.

## ముగిసిన ప్రతిష్ఠాపనోత్సవం



వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న భక్తులు

**మణికొండ:** నార్సింగిలో గత మూడు రోజులుగా కొనసాగుతున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి విగ్రహం, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనోత్సవం గురువారం ముగిసింది. ఉత్సవాల్లో చివరిరోజు గురువారం ఉదయం 6గంటలకు ద్వారతోరణ ధ్వజస్తంభారాధన, మూల మంత్రహోమాలు, న్యాసహోమం, శాంతిహోమం, బలిహరణం, పూర్ణాహుతి, ఉదయం 11.42 గంటలకు కుంభ ప్రోక్షణ ప్రాణప్రతిష్ఠ, శాంతి కల్యాణం, ఆశీర్వచనం పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు దేవాలయ ఆవరణలో పెద్దఎత్తున అన్నప్రసాదం పంపిణీ చేశారు. సాయంత్రం 6గంటలకు శ్రీ భూవికాసమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం, వేద ఆశీర్వచనం, స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## ఇంటి వద్దకే భద్రాచలం తలంబ్రాలు

**రాజేంద్రనగర్:** శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో జరిగే సీతారామచంద్రస్వామి కల్యాణ మహోత్సవ తలంబ్రాలను దేవాదాయశాఖ వారి సహకారంతో భక్తులకు ఇంటివద్దకే చేర్చే కార్యక్రమానికి టీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం శ్రీకారం చుట్టిందని రాజేంద్రనగర్ డిపో మేనేజర్ ఎం.శ్రీనాథ్ తెలిపారు. తలంబ్రాల కోసం భక్తులు రాజేంద్రనగర్ డిపో టీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రంలో రూ.151 చెల్లించి ఈనెల 18 వరకు బుకింగ్ చేసుకోవాలన్నారు. మేకల రాములు 9963005045, 9154298788.

# తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు..

**జలమండలి జనరల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి**



**మణికొండ:** వేసవికాలం ఎండలు మండిపోతున్నాయి. పెరుగుతున్న ఎండలతో పాటే భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. దీంతో అపార్ట్‌మెంట్‌లు, గృహాలకు ఉన్న బోర్లు వట్టిపోవటంతో ప్రజలకు నీటి సమస్య ఎదురౌతుంది. జలమండలి వారు సరఫరా చేస్తున్న నీటితో కాస్త ఉపశమనం కలుగుతున్నా.. అప్పుడప్పుడు పైపులైన్లు పగిలిపోవటంతో పూర్తిస్థాయిలో నీటి సరఫరా నిలిచిపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గండిపేట మండల ప్రజల నీటి సమస్యను తీర్చేందుకు ఎప్రిల్, మే, జూన్ నెలలకు తీసుకుంటున్న చర్యలపై జలమండలి మణికొండ డివిజన్-18, జనరల్ మేనేజర్ రవీందర్‌రెడ్డితో 'సాక్షి' ఇంటర్వ్యూ

**ప్రశ్న : గండిపేట మండలంలోని మున్సిపాలిటీల వారీగా జనాభా ఎంత ? నీటి సరఫరా చేస్తుంది ఎంత..?**

సమాధానం: మణికొండ, నార్సింగి, బండ్లగూడ మున్సిపాలిటీలలో ఉన్న జనాభా, నీటి కనెక్షన్‌లకు పొంతన లేదు. అపార్ట్‌మెంట్, గేటెడ్ కమ్యూనిటీలకు ఒకే కనెక్షన్‌లు ఉంటాయి. దీంతో మేమిచ్చే నీరు వారికి ఏమాత్రం సరిపోదు. ఒక్క మనిషికి 135 లీటర్ల చొప్పున సరఫరా చేస్తున్నాం.

**ప్రశ్న: మున్సిపాలిటీల వారీగా ప్రస్తుతం జరుగుతున్న నీటి సరఫరా ఎంత..?**

సమాధానం : మణికొండ మున్సిపాలిటీకి గతంలో 5 లక్షల లీటర్లు, నార్సింగి మున్సిపాలిటీకి 3.5లక్షల లీటర్లు, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్‌కు 2.9లక్షల లీటర్ల నీరు సరఫరా అయ్యేది. ప్రస్తుతం మణికొండ, నార్సింగిలకు కలిపి 10లక్షల లీటర్లు, బండ్లగూడకు 3.2లక్షల లీటర్లకు పెంచాం.

**ప్రశ్న : కొత్త రిజర్వాయర్లు ఎన్ని అందుబాటులోకి వచ్చాయి. రావాల్సినవి ఎన్ని..?**

సమాధానం : కొత్తగా మూడు రిజర్వాయర్లు 40లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్నవి అందుబాటులోకి వచ్చాయి. మరో 50 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న నాలుగు రిజర్వాయర్ల పనులు 90శాతం పూర్తయ్యాయి. నెల రోజుల్లో వాటిని అందుబాటులోకి తీసుకొస్తాం. మణికొండ గ్రామానికి రెండు రిజర్వాయర్ల అవసరం ఉంది. స్థలాలు లభించడం లేదు.

**ప్రశ్న : మండలంలో ట్యాంకర్ల ఫిల్లింగ్ స్టేషన్లు, ట్యాంకర్లు ఎన్ని ఉన్నాయి..?**

సమాధానం: ప్రస్తుతం మణికొండ క్వార్టర్స్, అలకాపూర్ టౌన్‌షిప్‌లోని నేతాజీ పార్కు, బండ్లగూడలోని భవానీనగర్, కిస్మత్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో మొత్తం నాలుగు ఫిల్లింగ్ కేంద్రాలు ఉన్నాయి. మణికొండ క్వార్టర్స్‌లో 5 ట్యాంకర్లు ఉండగా.. ఇటీవల వాటిని 9కి పెంచాం. మరో రెండ్రోజుల్లో మరో రెండు పెంచుతున్నాం. నేతాజీ పార్కులో మూడు ట్యాంకర్లు ఉండగా వాటిని ఐదుకు పెంచాం. మరో ఐదు పెంచి 13 చేస్తున్నాం. భవానీనగర్‌లో మూడు ఉండగా ఇటీవల ఐదుకు పెంచాం. త్వరలో మరో నాలుగు పెంచి 12 చేస్తున్నాం. కిస్మత్‌పూర్‌లో ఒక ట్యాంకర్ ఉండగా దాన్ని రెండుకు పెంచాం. నార్సింగి మున్సిపాలిటీకి అలకాపూర్ టౌన్‌షిప్ నుంచే సరఫరా చేస్తున్నాం. ఎక్కువ బుకింగ్స్ వస్తే నార్సింగి హైట్స్‌లో ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నాం.

**ప్రశ్న : కొత్త ఫిల్టర్ బెడ్‌లతో ఎంత నీరు అందుబాటులోకి రానుంది..?**

సమాధానం: మణికొండ క్వార్టర్స్‌లో 3 లక్షల లీటర్లు, బీఆర్‌సీ సమీపంలో 2లక్షల లీటర్ల గండిపేట నీటిని ఫిల్టర్ చేసి మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలకు అదనపు నీటిని అందిస్తాం. ఆ నీటిని ట్యాంకర్లకు కేటాయించి బుక్ చేసిన 24 గంటల్లోనే నిర్విరామంగా ట్యాంకర్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నాం. మిగిలే నీటిని సెక్రటేరియట్ కాలనీ, అలకాపూర్ టౌన్‌షిప్, తిరుమల హిల్స్, పాషాకాలనీ, ఖిద్రాకాలనీ, వైఎస్‌ఆర్ కాలనీ, పుప్పాల్‌గూడ గ్రామం, నార్సింగి గ్రామాలకు సరఫరా చేస్తాం. అక్కడ మిగిలే నీటిని మిగతా కాలనీలకు ప్రెషర్‌తో నీటిని సరఫరా చేస్తాం.

**ప్రశ్న : కొన్ని గృహాలకు పలుసార్లు సర్వే చేసినా క్యాన్ నెంబర్లు రాలేదు. వాటి పరిస్థితి ఏమిటి..?**

సమాధానం: మూడు మున్సిపాలిటీల్లో పలుసార్లు సర్వే చేసినా క్యాన్ నెంబర్లు రాలేదనే ఫిర్యాదులు ఉన్నాయి. వాటికి గతంలో గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలకు నీటి బిల్లులు చెల్లించిన రశీదులు జతచేసి ఓ అఫిడవిట్ ఇస్తే రెండ్రోజుల్లో క్యాన్ నెంబర్ జారీ చేస్తున్నాం. ఈ అవకాశాన్ని అలాంటి వారు సద్వినియోగం చేసుకోవాలి.

**ప్రశ్న : సింగూరు నుంచి సరఫరా వస్తున్న పైపు లైన్లు తరచూ పగిలేందుకు కారణం ఏమిటి..?**

సమాధానం : దశాబ్దాల క్రితం వేసిన పైప్‌లైన్లు కావటం, వేసవిలో డిమాండ్‌ను బట్టి నీటి సరఫరాను పెంచి తీసుకోవటంతో అప్పుడప్పుడు పైపులైన్ పగులుతుంది. వెంటనే మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరిస్తున్నాం. ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా కొత్త పైపులైన్ వేస్తే సమస్య తీరుతుంది. ప్రభుత్వం, జలమండలి బోర్డు పెద్దలు నిర్ణయించాలి.

**ప్రశ్న : పేదల కాలనీలకు రోజు నీటిని సరఫరా చేయలేరా..?**

సమాధానం : అది సాధ్యం కాదు. రిజర్వాయర్లు ఒకచోట, పేదల కాలనీలు మరోచోట ఉన్నాయి. అవసరమైతే వారికి సమయం పెంచి నీటిని సరఫరా చేస్తాం.

**ప్రశ్న : నీటి బిల్లుల కలెక్షన్ ఎలా ఉంది..?**

సమాధానం: గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఉన్నప్పుడు ప్రజలు నీటి బిల్లులు చెల్లించేందుకు అలవాటు పడలేదు. జలమండలి పరిధికి నీటి సరఫరా వచ్చాక బిల్లులు చెల్లించేందుకు అలవాటు పడ్డారు. ప్రస్తుతం 80శాతం బిల్లులు వసూలు అవుతున్నాయి. చెల్లించని వారికి వడ్డీలు పడుతున్నాయి. సకాలంలో బిల్లులు చెల్లిస్తేనే అవసరమైన మేర నీటిని సరఫరా చేసేందుకు జలమండలి బోర్డు అంగీకరిస్తుంది.

## బీజేవైఎం రాష్ట్ర మీడియా కో- ఆర్డినేటర్‌గా కిరణ్‌చారి



**రాజేంద్రనగర్:** బీజేవైఎం రాష్ట్ర మీడియా కో-ఆర్డినేటర్‌గా కె.కిరణ్ చారి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనను నియమిస్తూ రాష్ట్ర పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా కిరణ్‌చారి మాట్లాడుతూ.. తన సేవలను గుర్తించి తనపై ఎంతో నమ్మకంతో మీడియా కో-ఆర్డినేటర్‌గా పదవీ బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, యువ మోర్చా అధ్యక్షులు మహేందర్, జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహ్మరెడ్డి, జిల్లా నేతలు, రాజేంద్రనగర్ నియోజకవర్గం నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## 'వీఆర్‌ఫర్ యూ'తో సంబంధం లేదు

**మణికొండ:** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించాలనే ఉద్దేశంతో 8 ఏళ్ల క్రితం వృద్ధులంతా కలిసి స్థాపించిన ' వీఆర్‌ఫర్ యూ' స్వచ్ఛంద సంస్థతో నిర్మల్ గోలేచ, అందె లక్ష్మణ్‌రావు, దిలిప్ కక్కడ్‌లకు సంబంధం లేదని సంస్థ అధ్యక్షుడు బాపూజీ, ప్రధాన కార్యదర్శి డి.సీతారాందాస్‌లు తెలిపారు. తమ సంస్థను పోలి వారు మరో సంస్థను ఏర్పాటు చేసుకుని చేపడుతున్న కార్యకలాపాలతో తమకు సంబంధం లేదన్నారు. తమ సంస్థ ఎలాంటి విరాళాలు సేకరించదని, సమాజ సేవకు తమ సభ్యుల అందించే నిధులతోనే కార్యక్రమాలను చేపడతామని స్పష్టం చేశారు.

# సమాజహితానికి కృషి చేస్తా

**క్లాసిక్ మిసెస్ ఇండియా విజేత రత్నామెహ్రా**



మిసెస్ ఇండియాను అభినందించిన బంధుమిత్రులు

**మణికొండ:** సామాజిక కార్యకర్తగా చురుకుగా ఉంటూ.. 'సొసైటీ ఫర్ ఎంపవరింగ్ విమెన్ టూ అచీవ్ ఎన్జీఓ'లో సభ్యురాలిగా, సమాజానికి మేలు చేసే పలు అంశాలపై తన వంతు కృషి చేస్తానని క్లాసిక్ మిసెస్ ఇండియా విజేత రత్నామెహ్రా అన్నారు. రెండ్రోజుల క్రితం గుర్గావ్‌లో జరిగిన మిసెస్ ఇండియా పోటీల్లో ఆమె టైటిల్ విన్నర్‌గా నిలిచారు. గురువారం ఆమెను మణికొండ ల్యాంకో హంగింగ్ గార్డెన్స్ క్లబ్ హౌస్‌లో పలువురు అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మిసెస్ ఇండియా పోటీలు ఇంటర్వ్యూలు, ఆడిషన్స్, ఫైనల్ రౌండ్‌కు చేరుకుని 30 మంది మహిళలతో పోటీపడి విజేతగా నిలిచానన్నారు. టూరిజం, నేషనల్ కాస్ట్యూమ్ రౌండ్, టాలెంట్ రౌండ్, రెట్రో రౌండ్, క్లాసికల్ డ్యాన్స్ రౌండ్ వంటి రకరకాల విభాగాల్లో రాణించానన్నారు. తన విజయానికి భర్త రూపేష్‌కుమార్, కుటుంబసభ్యుల తోడ్పాటు, స్నేహితుల సహకారం మరవలేనిదన్నారు. హైదరాబాద్‌లో పుట్టి పెరిగి, సికింద్రాబాద్ సెయింట్ ఆన్స్ స్కూల్‌లో విద్యాభ్యాసం, ఐఐఎంలో కామర్స్‌లో గ్రాడ్యుయేషన్‌తో పాటు ఎంబీఏ చేశానని తన విద్యాభ్యాసం గురించి వివరించారు. ప్యాషన్, అంకితభావం, సానుకూల దృక్పథం, కష్టపడేతత్వం, నాయకత్వ లక్షణాలు తనను అన్ని రంగాల్లో రాణించేలా చేశాయన్నారు. మిసెస్ తెలంగాణగా నిలిచాక మరింత ఏకాగ్రతతో జాతీయ స్థాయిలో విన్నర్‌గా నిలవాలనే పట్టుదలతో పనిచేసి విజయం సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మిస్సెస్ ఇండియా రీజినల్ డైరెక్టర్ మమత త్రివేదిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## వ్యర్థాలపై చర్యలేవి ?



రోడ్డు ప్రక్కనే చెత్తకుప్పలు ఇలా..

**అత్తాపూర్:** రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి ముషేక్‌మహల్ వద్ద చెత్త మట్టి కుప్పలు నిత్యం పాదాచారులు, గ్రామస్తులు, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఏళ్లు గడిచినా వ్యర్థాలతో కూరుకుపోతున్న ఇరుకు రోడ్లకు విముక్తి కలగడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రచారం తప్పా.. ఆచరణకు నోచుకోని అత్తాపూర్ గ్రామ అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు సహకరించాలని ప్రజలు కోరుతున్నారు.

# ధరణి లొసుగులతో పెరిగిన భూ విస్తీర్ణం

- కబ్జాకు యత్నిస్తున్నారని రైతుల ఆందోళన
- తమ దృష్టికి రాలేదన్న తహసీల్దార్



శంకరాపురంలోని వివాదాస్పదంగా మారిన భూమి

**శంషాబాద్ రూరల్:** ధరణిని అడ్డుపెట్టుకుని రికార్డుల్లో భూ విస్తీర్ణాన్ని పెంచిన అక్రమార్కులు పట్టా భూములను కబ్జా చేస్తున్నారని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. మండలంలోని శంకరాపురం రెవెన్యూలోని సర్వే నంబరు 24లో 57 ఎకరాల 5 గుంటల భూమి ఉంది. ఇందులో 30 ఎకరాలు గైరాన్ కాగా.. 27 ఎకరాల 5 గుంటలను కొంతమంది పేద రైతులకు అసైన్ చేశారు. అయితే అసైన్ పట్టాదారుల నుంచి రియల్టర్లు 10 ఎకరాలు కొనుగోలు చేశారు. ఈ సర్వే నంబరులో మరో ఐదెకరాల విస్తీర్ణాన్ని రికార్డులో చేర్చారు. సదరు స్థలంలో అక్రమ నిర్మాణాలకు పూనుకున్నారని చెబుతున్నారు. గత కొద్ది రోజుల నుంచి ఈ భూమి చదును, ప్రహరీ నిర్మాణం చేపట్టారు. వారు కొనుగోలు చేసిన పదెకరాలకు తోడు కొత్తగా సృష్టించిన ఐదెకరాలను సొంతం చేసుకోవడానికి యత్నిస్తున్నారని ఆరోపణలున్నాయి. దీనికోసం సదరు భూమి పక్కన ఉన్న పట్టా భూముల్లోకి చొరబడి కబ్జాకు యత్నిస్తున్నారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అందరికీ సమన్యాయం చేయాలి..**

సర్వే నంబరు 24లో కొంత మంది భూములను పట్టా భూములుగా మార్చిన అధికారులు మిగతా రైతులకు కూడా పట్టాలు ఇచ్చి సమన్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు సర్వే నంబర్లలో అదనపు భూ విస్తీర్ణాన్ని సృష్టించి పట్టా రైతుల పొలాలను కబ్జా చేసేందుకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా వెంచరు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదులకు అధికారులు స్పందించడం లేదని తాజాగా డీజీపీ, ఆర్డీఓకు ఫిర్యాదు చేసినట్లు రైతులు పేర్కొన్నారు. వివరణ కోసం తహసీల్దార్ నాగమణిని సంప్రదించగా.. ఇప్పటి వరకు తన దృష్టికి రాలేదని వివరణ ఇచ్చారు.

# వర్ధమాన్‌లో 'బూట్ క్యాంపు' ప్రారంభం



**శంషాబాద్ రూరల్:** మండలంలోని వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాలలో 'బూట్ క్యాంపు'ను ఏర్పాటు చేశారు. ఇన్నోవేషన్ డిజైన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ విద్యార్థి ఆవిష్కరణలపై విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో వాధ్వాని ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ క్యాంపును గురువారం రాష్ట్ర ఐఅండ్‌సీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్‌రంజన్ ప్రారంభించారు. రెండ్రోజుల పాటు జరగనున్నఈ క్యాంపును దేశంలోని 9 ప్రాంతాల్లో ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ టీ.జీ.సీతారాం ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. గత ఫిబ్రవరిలో ఇన్నోవేషన్ సెల్ నిర్వహించిన స్కూల్ ఇన్నోవేషన్ కంటెస్ట్‌లో విద్యార్థులు 6,700 ఆవిష్కరణలు చేపట్టగా.. ఈ క్యాంపులో అవకాశాల గుర్తింపు, డిజైన్ థింకింగ్ టూల్స్ మాస్టరింగ్, కస్టమర్-సెంట్రిక్ ఉత్పత్తులు, సేవలను అభివృద్ధి చేసేందుకు అవసరమైన నైపుణ్యాలు వివరించారు. వాధ్వాని ఫౌండేషన్ ప్రతినిధులు విష్ణుప్రియ, విష్ణుప్రసాద్, శివాల్ నాయర్, నోడల్ సెంటర్ హెడ్స్ డాక్టర్ జేవీఆర్ రవీంద్ర, ప్రొఫెసర్ వివేక్ కులకర్ణి, కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ప్రిన్సిపల్

**మణికొండ:** ఆపదలో ఉన్న వారికి రక్తదానం వారి ప్రాణాన్ని నిలుపుతుందని, అలాంటి వారికి యువత ఎక్కువసార్లు రక్తదానం చేయాలని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్ రెడ్డి అన్నారు. గురువారం కళాశాల విద్యార్థులు ప్రతిమ సాయి బ్లడ్ బ్యాంక్ వారి కోరిక మేరకు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. రక్తదానంతో జీవితాలను కాపాడే అవకాశం ఉంటుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుధాకర్‌రెడ్డి, హెచ్‌ఆర్ అమర్‌నాథ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ జి.బాల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గం సభ్యులు



నూతన అధ్యక్షుడిని సన్మానించిన న్యాయవాదులు

**రాజేంద్రనగర్:** ఇటీవల ఎన్నికైన రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం సభ్యులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఉప్పర్‌పల్లి కోర్టు సమావేశ మందిరంలో అసోసియేషన్ అధ్యక్షుడిగా శీలం వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా టి.ఎల్.శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఆర్.వెంకటేశం, జాయింట్ సెక్రటరీగా తులసి రామ్‌నాయక్, క్రీడా సంస్కృతి కార్యదర్శిగా కె.ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా రాజశేఖర్, లైబ్రేరియన్ సెక్రటరీగా కృష్ణ, కార్యనిర్వాహక సభ్యుడిగా గుర్మీత్‌సింగ్, ప్రతాప్‌గౌడ్, శశికాంత్‌రెడ్డి, జయకృష్ణ, లేడీ రిప్రజెంటేటివ్‌గా భానుప్రియలకు పదవీ బాధ్యతలు అప్పగించారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించిన న్యాయవాదులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## 'కార్మికులతో ఎస్‌ఎఫ్‌ఏలు వెట్టి చాకిరి'


**రాజేంద్రనగర్:** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులను శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్స్ (ఎస్‌ఎఫ్‌ఏ)లు వెట్టి చాకిరి చేయిస్తున్నారని రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి ఆరోపించారు. సర్కిల్ పరిధిలో 33 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని, ఉదయం 5 గంటలకు వచ్చి పారిశుద్ధ్య కార్మికులు హాజరు తీసుకోవాలన్నారు. బస్తీల్లో పారిశుద్ధ్యం.. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2 గంటల వరకు పారిశుద్ధ్య కార్మికులు హాజరు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కార్యాలయంలో మీటింగ్‌లు పెట్టి రోజు, వీక్లీ సెలవు ఉన్నా.. మీటింగ్‌కు రాకపోతే పెనాల్టీలు వేస్తామని అధికారులు బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీక్లీ సెలవు తీసుకోవాలంటే ఉదయం 5 గంటలకే వచ్చి పారిశుద్ధ్య పనులు చేయించాలన్నారు. బస్తీలో చెత్త సేకరణ పిన్ పాయింట్ చేయాలి.. తిరిగి నైట్ డ్యూటీ చేసి వీక్లీ సెలవులు తీసుకోవాలని అధికారులు చెబుతున్నారన్నారు. నైట్ డ్యూటీ చేస్తే కార్మికులకు ఓటీ.. కూడా ఇవ్వకుండా కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రభుత్వ స్థలాలు కాపాడేందుకు ప్రణాళికలు సిద్ధం

**అత్తాపూర్:** అన్యాక్రాంతమవుతున్న దేవాలయ భూములను కాపాడుకునేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కనుమరుగవుతున్న చెరువులు, కుంటలను రక్షించుకునేందుకు జీహెచ్‌ఎంసీ ప్రత్యేక ప్రణాళికతో పాటు గత ప్రభుత్వంలో వాకింగ్ ట్రాకులు యువకులకు ఉపయోగపడేలా జిమ్ములు, వృద్ధులు మహిళలకు అణువుగా పెద్ద తాళ్లకుంటలో పూర్తి స్థాయిలో అభివృద్ధి జరిగితే ప్రజలకు మరింత ఉపయోగపడుతుంది. ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పెద్ద తాళ్లకుంట అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- ప్రభుత్వ స్థలాలను పరిరక్షించుకునేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రభుత్వ స్థలాలు కబ్జాలు చేయకుండా ఉండేందుకు వాకింగ్ ట్రాక్‌లు, చెరువులు కుంటల్లో జీహెచ్‌ఎంసీ అభివృద్ధి చేసింది. పెద్ద తాళ్లకుంట అభివృద్ధికి పూర్తిస్థాయిలో యోగ సెంటర్‌ను కూడా నిర్మిస్తామని మున్సిపల్ కమిషనర్ రవికుమార్ అన్నారు.
- జీవనశైలిని మార్చుకునేందుకు వీలుగా యోగాసనాలు పూర్తిస్థాయిలో ఉపయోగపడతాయని యోగా మాస్టర్ సునీల్ బిరాదర్ అన్నారు. ఉదయం, సాయంత్రం యోగాసనాలపై దృష్టిసారించాలన్నారు.

## బీజేవైఎం నూతన కమిటీకి సన్మానం



**రాజేంద్రనగర్:** బీజేవైఎం రాష్ట్ర నూతన కమిటీ ఏర్పడిన సందర్భంగా రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షులు సెవెళ్ల మహేందర్, ప్రధాన కార్యదర్శులు పవన్, గణేష్ కుండేలను గురువారం రంగారెడ్డి జిల్లా బీజేవైఎం ఉపాధ్యక్షులు కొంగళ్ల నవీన్, నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు.